# మార్పు

— అమలాపురపు వెంకట సుబ్బలక్ష్మి



యూనివర్శిటీలో పరీక్షలు జరుగుతున్నాయ్. చాలా మంది ప్రవేట్ కాండిడేట్స్ పరీక్షలు రాస్తున్నారు.

థర్డ్ బెల్ కొట్టడంతో పేపర్ల డిస్ట్రిబ్యూషన్ పూర్త యింది. హాల్ టికెట్స్ వెరిఫై చేస్తున్న నాకళ్ళు అనుమానాస్పదంగా ఓ కేండిడేట్ ముఖంలోకి గ్రుచ్చి గ్రుచ్చి చూశాయి. పేరు దమయంతి. అంటే! ఎవరో గుర్తుకుతెచ్చుకోబోయాను. "నేనే మేడమ్! ఐదారేళ్ళ క్రిందట మీ కాలేజీలో ఇంటర్ డిస్కంటిన్యూ చేసిన దమయంతిని. మీ సలహాను అక్షరాలా పాటించి, మా నాన్నగారు నాకు వెంటనే పెళ్ళి చేశారు. మావారు ఇక్కడే జాబ్ చేస్తున్నారు. ఖాళీగా ఇంట్లో తోచక ప్రవేట్‌గా బి.ఏ. చేస్తున్నాను. అప్పట్లో చదువుపట్ల నాకు ఆసక్తి లేదు. కాని ఇప్పుడు చదువుకోవాలని ఉంది. నన్ను గుర్తుపట్టలేదా మేడమ్!" నెమ్మదిగా అంది దమయంతి.

గతం నాకళ్ళ ముందు మెదిలింది.

ఆ రోజు బోటనీ లాబ్‌లో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. స్టూడెంట్స్, సెక్షన్ కటింగ్ చేస్తూ, బ్లేడ్లతో కుస్తీ పడుతున్నారు. మరి కొందరు మైక్రోస్కోపుల్ని ఫోకసు చేస్తున్నారు. స్టెయినింగ్ కుదరక, ప్రక్కవాళ్ల సెక్షన్లను తొంగి చూస్తున్నారు ఇంకొందరు.

ఇంతలో బయటి నుంచి మాటలు విన్పిస్తున్నాయ్.

"పిల్లలకి ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. కాసేపు వెయిట్ చేయండి. డిస్టర్బ్ చేస్తే అనవసరంగా మేడమ్ నన్ను కోప్పడతారు.!" అంటున్నాడు అటెండర్.

"ఫరవాలేదులేవయ్యా! పొరుగూరు నుంచి వచ్చాను. మా పాప ఈ క్లాసులో ఉంది. మేడమ్‌తో రెండు నిమిషాలు మాట్లాడి వెళ్ళి పోతాను. ప్రిన్సిపాల్ పర్మిషన్ తీసుకునే వచ్చాను కదా! దేముడు వరమిచ్చినా, పూజారి వరమీయడులాగుంది!" అంటూ సణుక్కుంటున్నాడాయన.

"మేడమ్‌తో చెప్పి వస్తానుండండి" అటెండర్ లోపలికి కదిలేలోపులోనే కాలింగ్ బెల్ మ్రోగింది.

"ఏమిటి రాములు, అక్కడ గొడవ?" ప్రశ్నించాను విషయం తెలుసుకుందామని.

"ఏం లేదండి! ఎవరో స్టూడెంట్ తండ్రి పొరుగూరు నుంచి వచ్చాడట. మీతో మాట్లాడాలట!" విషయం చెప్పాడు రాములు.

"రమ్మను" అన్నాను.

నా మాట పూర్తికాకుండానే లోపలికి దూసుకు వచ్చాడాయన. "నమస్తే మేడమ్!"

"నమస్తే!". ప్రశ్నార్థకంగా చూశాను.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించండి!" అన్నాడు.

"ఫరవాలేదు కూర్చోండి!" కుర్చీ చూపించాను.

"థాంక్యూ మేడమ్! ఏం లేదు! మా అమ్మాయి పేరు దమయంతి. ఇక్కడ సీనియర్ ఇంటర్ చదువు తోంది. నేను గూడూరులో టీచరుగా పనిచేస్తున్నాను. ఒక్కసారి లెక్చరర్స్‌ని మీటయి, మా అమ్మాయి ప్రోగ్రసు కనుక్కుందామని, సెలవు పెట్టి వచ్చాను. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. మీరొకసారి శ్రమ అనుకోకుండా, మా అమ్మాయి గురించి చెప్పగలరా?" బాధ్యతగల తండ్రి కనిపించాడాయనలో.

"అలాగేనండీ! తప్పకుండా చెప్తాను. ఇంత బాధ్యతగా మీరు వచ్చి మీ అమ్మాయి గురించి కనుక్కుంటుంటే, చెప్పటం మా డ్యూటీ. పేరేమిటన్నారు?" తలెత్తి ఆయన ముఖంలోకి చూశాను.

"దమయంతి." అప్పటికే ఆయన కళ్ళు వాళ్ళమ్మాయి కోసం లాబ్ అంతా వెతికాయి.

టేబుల్ మీద ఉన్న అటెండెన్సు రిజిస్టరు తెరిచాను. ఫస్ట్ బాచ్, సెకండ్ బాచ్, థర్డ్ బాచ్ పేర్ల వెంట నా కళ్ళు పరుగెడుతున్నాయ్. థర్డ్‌బాచ్‌లో డి.దమయంతి పేరుంది. కాని ఆ అమ్మాయి ఆబ్సెంట్.

"మీ అమ్మాయి, ఈరోజు రాలేదండి. గత ఆరు నెలల్లో రెండుసార్లు మాత్రమే ప్రాక్టికల్స్‌కు వచ్చింది. మీ అమ్మాయి చాలా ఇర్రెగ్యులర్. అల్‌మోస్టు, ప్రాక్టికల్స్ పూర్తి కావచ్చాయి. ఇంత అశ్రద్ధ అయితే ఎలా? క్రిందటి నెల, మీ అమ్మాయి గురించి ప్రిన్సిపాల్‌కి చెప్పాను. అటెండెన్సును బట్టీ చూస్తే ఆమెను పరీక్షకు పంపడం, మాతరం కాదు!" చెప్పుకుపోతున్నాను మామూలు ధోరణిలో.

ఆయన ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క

లేదు. మనిషి షాక్ తిన్నట్టున్నాడు. మాటలు తడబడుతున్నాయ్.

"లేదు మేడమ్! మా అమ్మాయి చాలా తెలివైన పిల్ల. రోజూ రెగ్యులర్‌గా కాలేజీకి వస్తోందండీ. మీరేమైనా పొరపాటున.....?" ఆగాడాయన.

ఆయన పరిస్థితి చూచిన నాకు జాలేసింది.

"లేదండి! నేనేమీ పొరబడలేదు. మీ అమ్మాయి ఫస్టుఇయర్‌లో కాస్త రెగ్యులర్‌గానే ఉండేది. ఈ సంవత్సరం మాత్రం ఎప్పుడో అమావాస్యకు, పౌర్ణమికు మాత్రమే, క్లాసులకి వస్తోంది. పోనీ మా సబ్జెక్ట్ మాటటుంచి, మిగ్గిలిన లెక్చరర్స్‌ని కూడా కనుక్కుందాం. ముందు జనరల్ అటెండన్సు చూస్తే అసలు సంగతి తెలుస్తుంది!" అన్నాను.

వెంటనే అటెండర్‌ని పిలిచి, ఆఫీసులో కన్‌సర్న్ క్లర్క్‌ని అడిగి అటెండెన్సు రిజిష్టరు తెమ్మన్నాను.

అన్నదే తడువుగా, వెళ్ళి అటెండెన్సు రిజిష్టరు పట్టుకు వచ్చాడు.

కాలేజీ తెరచిన దగ్గర నుంచి, దమయంతి అటెండెన్సు పరిశీలించి, ఆయనకు చూపించాను.

నెలలో అప్పుడప్పుడు కాలేజీకి వచ్చినట్లుగా అటెండెన్సు మార్కు చేసి ఉంది.

అటెండెన్సు చూచిన ఆ తండ్రి బిత్తర పోయాడు. అమ్మాయి కాలేజీకి రాకుండా ఏంచేస్తోందో అతనికి అర్థం కాలేదు.

"నేను కాలేజీకి వచ్చేముందు, మా అమ్మాయి ఉన్న రూమ్‌కి వెళ్ళాను. పిల్ల రూమ్‌లో లేదు. నిరుడంతా అమ్మాయి ఒక్కతే వంట చేసుకు తిని, చదువుకుంది. ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్ష గనుక, వంట చేసుకుని చదువుకోవటం కుదరదని, పిల్లకు వండి వార్చేందుకు, మా అమ్మను ఇక్కడే పెట్టాను. అమ్మ నడిగితే పిల్ల రెగ్యులర్‌గా ట్యూషన్‌కి, కాలేజీకి వెళుతోందని చెప్పింది. ఈ రోజు ప్రైవేటు క్లాసుందని, ఉదయం ఎనిమిది గంటలకే బయలుదేరి వచ్చిందట! మరేమయినట్లు?" జుట్టు పీక్కున్నంత పని చేశాడాయన.

ఇంకా, నా అనుమానం తీరక, ఆ అమ్మాయి క్లాసు మేట్స్‌ని అడిగాను.

ఆ అమ్మాయి, ఫస్టియర్‌లో రెగ్యులర్‌గానే వచ్చేదని, సెకండియర్‌లో, ఎప్పుడోగాని రావటంలేదని తోటి విద్యార్థినులు చెప్పారు.

ఆ తండ్రికి, తన కూతురు కాలేజీకి రెగ్యులర్‌గా రావటం లేదని అర్థమయింది. ఆయన కళ్ళముందు భూమి బొంగరంలా గిర్రున తిరిగింది. మాట్లాడే స్థితిలో లేడాయన.

"చూడండి మాస్టారు! మీ అమ్మాయి స్నేహాల వల్ల కాలేజీ మానివేసి ఉండవచ్చు. కాలేజీకని చెప్పి, పుస్తకాలు పుచ్చుకుని ఏ సినిమాకో, షికార్లకో వెళుతూందేమో, ఒక్క సారి చెక్ చేసుకోండి. ఈ వయసులో పిల్లలు అటువంటి అసాధారణ వేషాలు వేయటం చాలా సహజం. మీరు ఆ అమ్మాయి పట్ల వహిస్తున్న శ్రద్ధకు, ఈ విధంగా మిమ్మల్ని దగా చేయటం న్యాయం కాదు!" అన్నాను.

"ఏమిటో నండీ! దానికి నేను ఏలోటూ చెయ్యలేదు. ఆడపిల్లని కూడా ఖర్చుకి జంకకుండా, ఈ పట్నంలో పెట్టి మంచి కాలేజీలో జాయిన్ చేసి చదివిస్తున్నాను ఇదే పెద్దపిల్ల. ఇంకా ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. పిల్ల, చురుకైంది మంచి చదువు చెప్పిస్తే, దాని బ్రతుకు బాగుంటుందని, తలకు మించిన భారమయినా, భరిస్తున్నాను. ప్రతీ వారం, అంత దూరం నుంచి వచ్చి చూచి పోతున్నాను. బియ్యం దగ్గర నుంచి, తిలకం దాకా అవసరాలన్నీ తరచి తరచి కనుక్కొని సప్లై చేస్తున్నాను. ట్యూషన్లకు, ఫీజులకు, పుస్తకాలకు ఎంతో డబ్బు వెచ్చించాను. పిల్ల రోజూ చదివి అలసిపోతోందని, కాస్త రిలీఫ్ కోసం, అప్పుడప్పుడు సినిమాలకు కూడా తీసుకువెళుతూ ఉండేవాడ్ని. తలకు మించిన భారాన్ని వహిస్తున్న నన్ను ఎంత మోసం చేస్తోంది?" ఆయన నిజాన్ని భరించలేక పోతున్నాడు.

"పోనీ మాస్టారూ! మిగిలిన లెక్చరర్స్‌ని కలుసుకుంటారా? పంపుతాను"

"వద్దమ్మా! వద్దు! విన్నది చాలు. నేనే వెళ్ళి, దాన్ని దండించి నిజా నిజాలు కనుక్కుంటాను. ఆ పాపిష్టిదాని కోసం మిమ్మల్ని అందరినీ శ్రమ పెడుతున్నాను. రేపు వచ్చి కలుస్తానమ్మా! అంటూ రెండు చేతులు జోడించి, కళ్ళ నీళ్ళతో, నా జవాబు కోసమయినా, ఎదురు చూడకుండా, వెళ్ళిపోయాడు.

* * *

మర్నాడు డిపార్టుమెంటులో తీరిగ్గా కూర్చున్నాను. దమయంతి తండ్రి వచ్చాడు. పది పదిహేను రోజులు జబ్బు పడ్డ మనిషిలా తయారయాడు.

"అమ్మా! చూశారా? మా అమ్మాయి నన్నెంత మోసం చేసిందో? మీరన్నట్లుగా అంతా సహవాస దోషమండీ! అయినా! మన బంగారం మంచిది కానప్పుడు, ఎవర్ని మాత్రం నిందించి ప్రయోజనం చెప్పండి? నేనీ బాధను భరించలేకుండా ఉన్నానండీ!" అంటూ వణికి పోతున్నాడు.

నాకాయన్ని చూస్తే పుట్టెడు జాలి వేసింది. కప్పులో కాస్త కాఫీ పోసి ఇచ్చాను.

"మాస్టారూ! ముందు కాస్త కాఫీ త్రాగండి. అసలేమయింది? మీ అమ్మాయి క్షేమంగానే ఉందా?" అన్నాను ఓదార్పుగా.

"దానికేమిటమ్మా! గుండ్రాయిలా ఉంది. ఎటొచ్చి, అటువంటి దగాకోరుకి తండ్రినయినందుకు నేను తల కొట్టుకు చావాలి. నా బుర్ర తిరిగి పోతోంది. నిజాన్ని జీర్ణం చేసుకోలేక పోతున్నాను. నేను తెలుసుకున్న విషయాలు కలగా మిగిలితే ఎంత బాగుండునో అని విలపిస్తున్నానమ్మా!" ఆగాడాయన.

"విషయం చెప్పండి మాస్టారూ!" అన్నాను.

"అందుకే నమ్మా! నేను మీ దగ్గరకు వచ్చాను. ఈ రోజు కూడా ఇక్కడే ఉండి సమస్య పరిష్కరించి గాని, ఇంటికి వెళ్ళదలచుకోలేదు. అసలు సంగతి వినండి. నా బాధేమిటో మీకే తెలుస్తుంది. మీ దగ్గర నుంచి తిన్నగా రూమ్‌కి వెళ్ళాను. మా అమ్మాయి అప్పుడే వచ్చింది.

"ఏమ్మా! ఎక్కడికి వెళ్ళావ్?"

"కాలేజీ నుంచి తిన్నగా వస్తున్నాను నాన్నా!"

"ఈ రోజు ఏమైనా క్లాసులు జరిగాయా?"

"అబ్బ ఒకటే క్లాసులు నాన్నా! ప్రొద్దున్న ఎనిమిది గంటల నుంచి, ఇప్పటివరకు ఒక్క పీరియడ్ కూడా ఖాళీలేదు. ఊదరగొట్టేస్తున్నారనుకో. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి కదా! సిలబస్‌లు కంప్లీటు చెయ్యాలని మా మేడమ్స్ పోటీ పడుతున్నారులే! నాన్నా! అమ్మా, తమ్ముడు, చెల్లి బాగున్నారా? తమ్ముడు టెన్త్ కదా! బాగా చదువుతున్నాడా?"

"అంతా బాగానే ఉన్నారు. నాకు అబద్ధాలంటే చాలా అసహ్యం. ఆ సంగతి నీకు తెలుసు కదా?"

"అవును! తెలుసు నాన్నా!"

"ఛీ ఛీ! మాటిమాటికి నన్ను నీవు నాన్నా! నాన్నా! అంటుంటే అసహ్యమేస్తోంది. ఎంత గుండెలు తీసిన బంటువి! నిలువునా తడిగుడ్డతో, గొంతులు కోయగల నేర్పరివి! తిన్నగా సినిమా నుంచి వస్తున్నావా?" గర్జించాను.

"నాన్నా! అమ్మాయి ముఖం వెలవెల బోయింది.

"దొరికి పోయానని భయపడుతున్నావా! నిజాన్ని ఎంత కాలం దాచగలవు? నీకు నేను ఏం అన్యాయం చేశానని నన్నింత మోసం చేస్తున్నావ్? నన్ను మోసం చేస్తున్నానని, నిన్ను నీవే మోసం చేసుకుంటున్నావ్. ఇంక మాట లెందుకులే! పెట్టె బేడా సర్దు. వెళ్ళి పోదాం."

"నాన్నా! క్షమించు. ఏదో ఫ్రెండ్స్ బలవంతం చేస్తే, ఈ ఒక్క రోజు, తప్పని సరై సినిమాకు వెళ్ళాను"

"ఇంకా అబద్ధాన్ని పొడిగించకు! నీవు కాలేజీ ఎగ్గొట్టి. ఎన్నెన్ని ఘనకార్యాలు చేస్తున్నావో, అన్నీ విచారించే వచ్చాను. అతిగా బుకాయించకు. నాకు నిన్ను చూస్తే, చాలా అసహ్యంగా ఉంది. నా ఓర్పు పరీక్షించకు. నీ వింకా, నీచంగా బొంకితే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి నీ పీక నులిమి పారేయగలను! థూ! సిగ్గులేని దానా?" అంటూ అసహ్యించుకున్నాను. ఈడ్చి పెట్టి కొట్టేవాడినే, కాని ఆడపిల్లను చెయ్యి చేసుకోవడం, మంచిది కాదని ఊరుకున్నాను.

మా అమ్మాయి పూర్తిగా కాలేజీకి, ట్యూషన్‌లకి వెళ్ళటం మానేసింది. ఫీజులకని ఇస్తున్న డబ్బుతో సినిమాలు చూస్తోంది. స్నేహితురాళ్ళ ఇళ్ళకు వెళ్ళి కాలక్షేపం చేస్తోంది.

అమ్మాయి పుస్తకాల్లో దొరికిన చవకబారు సాహిత్యాన్ని బట్టి, మిగిలిన వేషాలు కూడా వేస్తోందేమోనని అనుమానంగా ఉంది నాకు.

టెన్త్ వరకు నేను వెనకాల ఉన్నాను కాబట్టి, పోరి చదివించాను కాబట్టి చదివింది. ఒక్కసారిగా స్వేచ్ఛ లభించేసరికి, అవకాశాన్ని దుర్వినియోగం చేసుకొని చెడు మార్గంతో పయనిస్తోంది. నా పెంపకంలో ఏదో లోపముందమ్మా! ఒక్కసారిగ్గా, పల్లెటూరి వాతావరణం నుంచి, పట్నం వాసంలోకి అడుగు పెట్టేసరికి, వ్యామోహాలు పెరిగి, మంచి చెడ్డలు తెలుసుకొని మసలే విచక్షణా జ్ఞానం నశించింది. దానికి తోడు స్నేహాలు కూడా అలాగే ఉన్నాయి. ఇదంతా నా ప్రారబ్దం.

ఇప్పుడేం చెయ్యాలో తెలియటం లేదమ్మా! మీతో నా బాధంతా, ఒక్కసారి చెప్పుకొని వెళ్ళిపోదామని వచ్చాను. పిల్లనేం చెయ్యాలో, అర్థం కావటం లేదు. ఇప్పటి కిప్పుడు ఫస్టియరు, సెకండియరు సిలబస్సులు చదివి పరీక్షకు కూర్చోగలదంటారా? ప్రాక్టికల్ పరీక్షలు పాసు కాగలదంటారా?

మీరేమయినా ఆలోచించి సలహా ఇవ్వగలరా?

నాకా క్షణంలో ఆయన్ని ఎలా ఓదార్చాలో తెలియలేదు. ఏం సలహా ఇవ్వాలో తోచలేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు స్ఫురించింది.

"మాస్టారూ! నేనిలా చెప్పానని మీరేమీ అనుకోవద్దు. పిల్లకు చదువు మీద ధ్యాస లేదు కనుక, హాయిగా పెళ్ళిచేసేయండి" మాటవరసకన్నాను.

"ఏమోనమ్మా! పెళ్ళిళ్ళు మాత్రం అంత ఈజీగా కుదురుతాయా? కాని మీరు చెప్పిన విషయం వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది. ఏ నాటికైనా పెళ్ళి బాధ్యత తప్పదు కదా! ఈ రోజే పిల్లని తీసుకొని, మా ఊరు వెళుతున్నాను. ఆ పైన దేముడే ఉన్నాడు

సెలవిప్పించండమ్మా" నమస్కారం పెట్టి నిష్క్ర మించాడా తండ్రి.

ఇంకా ఏదో చెప్పాలని పెదవి విప్పిన నా మాటను ఆయన వినిపించుకోలేదు.

నెల్లాళ్లు తిరక్కుండానే దమయంతి పెళ్ళి శుభలేఖ నా చేతుల్లో ఉంది.

"నేనిచ్చిన సలహాను అక్షరాలా పాటించాడన్న మాట దమయంతి తండ్రి!" నిట్టూర్చాను.

ఇలా మనకెంతో మంది దమయంతులు, కాస్త డిగ్రీ తేడాలో ఎదురవుతుంటారు.

అయినా ఎంతమంది తండ్రులు పిల్లలకి అనుకున్న వెంటనే పెళ్ళి చేయగలుగుతారు?

ఆ విషయంలో దమయంతి, నిజంగా అదృష్ట వంతురాలే.

వాస్తవాన్ని గ్రహించిన ఆ తండ్రి, బాధ్యత నెరిగ్గి వెంట పిల్లకు పెళ్ళిచేయ ప్రయత్నించి సఫలీకృతు డయ్యాడు. తండ్రి ఇచ్చిన అవకాశాన్ని, ఆ నాడు సక్రమంగా అందుకోలేక పోయినా, ఈనాడు, తనకు తానుగా, చదువుమీద అభిరుచి పెంచుకొని, ప్రగతి పథం వైపు సాగిపోతోంది దమయంతి. ఏదైనా దూర మయి నప్పుడే దాని విలువ తెలుస్తుందన్న వాస్త వానికి నిదర్శనమే ఈ దమయంతి, అనిపించింది. దీర్ఘంగా నిట్టూర్చి, వెరిఫికేషన్ కొనసాగించాను.

* * *

పరీక్ష అయిపోయింది. పేపర్లు చీఫ్ సూపర్నెంట్‌కి అప్పజెప్పి వస్తున్నాను బయట దమయంతి నిలబడి ఉంది.

"ఏమ్మా నాకోసం వెయిట్ చేస్తున్నావా?"

"అవును మేడమ్! పరీక్ష హాల్లో మీతో ఎక్కువ మాట్లాడలేక పోయాను. రెండు నిమిషాలు మీతో మాట్లాడాలని ఆగాను."

"నీవు చదువు కొనసాగిస్తున్నందుకు చాలా సంతో షిస్తున్నానమ్మా!"

"థాంక్స్ మేడమ్! మావారిది ఎగ్జిక్యూటివ్ జాబ్. ఆయన తోటి ఆఫీసర్ల భార్యలందరూ, కనీసం డిగ్రీ వరకు అయినా చదువుకున్నవాళ్ళే. పార్టీలకు వెళ్ళి నపుడు, మీరేం చదువుకున్నారని, ఎవరైనా అడిగితే, నా గతం నన్ను వెక్కిరించేది. దానికి తోడు, నా స్నేహితురాళ్ళంతా, చక్కగా చదువుకుని, ఉద్యోగాల్లో సెటిల్ అయ్యారు. వాళ్ళందరి కంటే నే నెందులోనూ తీసిపోను. ఆ విషయం నాకు తెలును. అందుకనే, ఆగిపోయిన చదువుని, మళ్ళీ కొనసాగిస్తున్నాను. దానికి మా వారి ప్రోత్సాహం కూడా ఉంది. ఫస్టియర్ డిగ్రీలో అన్నిటిలోను అరవై శాతం పైగానే మార్కులు వచ్చాయి. ఆ నాడు చేజేతులా, చదువు పాడు చేసుకున్నానని, ప్రతీ క్షణం బాధ పడుతున్నాను మేడమ్!"

"పోనీలే దమయంతీ. సహజంగా నీవు తెలివైన దానివి. ఇప్పుడు చదువుకోవాలన్న పట్టుదల నీలో కలిగింది. నాకెంతో ఆనందంగా ఉందమ్మా. నీ చదు వాగిపోవటానికి, నా పాత్ర కూడా కొంత ఉందేమో నని నేనిప్పుడు బాధ పడనవసరం లేదు. నీకేదైనా సహాయం కావాలంటే, మొహమాట పడకుండా, కాలే జీకి రా. మన మేడమ్స్, నీకు కావలసిన పుస్తకాలు, నోట్సులు ఇస్తారు. డౌట్స్ ఏమైనా ఉంటే క్లియర్ చేస్తారు" అన్నాను.

"చాలా థాంక్స్ మేడమ్! ఇప్పుడు నాకెంతో తృప్తిగా ఉంది." అంటున్న దమయంతి వైపు సంతృప్తిగా చూశాను. ●

### విలువైన విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి పెడుతున్న


# లేసు అల్లిక

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పరిసర గ్రామాలలోని లేసు అల్లకం ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెట్టటమే కాక మన హస్తకళా నైపుణ్యాన్ని విదేశాలలో చాటి చెబుతోంది.

సుమారు 150 సంవత్సరాల క్రితం ఈ లేసు అనే అలంకార వస్తువును స్వీడన్ మిషనరీ స్త్రీలు ఇక్కడి మహిళలకు పరిచయం చేశారు. ఆ తరువాత ఐరిష్, ఆస్ట్రేలియా ఆంగ్లో-ఇండియన్ స్త్రీలు లేసులోని మెళుకువలు స్థానికులకు నేర్పించారు.

మొదట్లో ఈ లేసు అల్లకం కేవలం సమాజానికి దూరంగా వెలివేయబడిన హరిజన స్త్రీలకి జీవనోపాధి కల్పించటం కోసం వారు నేర్పారు. అయితే నేడు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సుమారు రెండు లక్షల కుటుంబాలు ఈ వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నాయి.

ఈ లేసుని తొలిదశలో కొద్ది డిజైన్లలో తయారు చేసినా ప్రస్తుతం సుమారు రెండు వేల డిజైన్లలో తయారు చేస్తున్నారు. ఇది కేవలం ఇంటి వద్ద కూర్చుని చేసే పని కావటంతో చిన్న పిల్లల నుంచి 70 సం॥ల వృద్ధమహిళల వరకు ఈ వృత్తిని కొన సాగిస్తున్నారు.





జేబు రుమాళ్ల నుంచి దుప్పట్ల వరకు లేసులలో తయారు చేస్తున్నారు. పూర్వం మాంచెష్టర్ నుంచి వచ్చిన దారం ఉపయోగించేవారు. అయితే ప్రస్తుతం మదురా కోట్స్ ప్రియదర్శిని దారాలు ఉపయోగిస్తున్నారు.

లేసు అల్లిక కంటి దృష్టికి ప్రమాదం అని తెలిసీ రేయింబవళ్లు అల్లుతున్న వీరికి రోజుకి 15 రూలు మించి కూలి గిట్టుబాటు కావటం లేదు. కాని లేసుని విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారస్థులు మటుకు లక్షలాది రూపాయలు వీరి ద్వారా గడిస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌లోని నరసాపురం ప్రాంతం లేసుకి విదేశాలలో మంచి పేరుంది. అయితే ఇటీవల కాలంలో చైనా దేశం యంత్రాల ద్వారా తయారు చేసిన "లేసుని ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశ పెట్టిలేది. అయినా చేతితో తయారైన భారత లేసుని విదేశీయులు ఎక్కువగా ఆదరిస్తున్నారు.

ఎలాంటి యంత్రాలు లేకుండా సూది దారంతో, ఖాళీ సమయాల్లో స్త్రీలు ఎంత నైపుణ్యంతో వివిధ రకాల రంగుల డిజైన్లలో అందాలు సృష్టిస్తున్న ఈ లేసు పరిశ్రమ మన రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణం. కాగా కోట్లాది రూపాయలు విదేశీ మారక ద్రవ్యం అర్జించి పెడుతున్న ఈ లేసు కళని ఒక కుటీర పరిశ్రమగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించక పోవటం వల్ల స్వదేశంలో స్వరాష్ట్రంలో మటుకు ఈ కళకి ఆదరణ కరువైందనే చెప్పవచ్చు.

ఎల్. వెంకట రత్నం